
# సింగిల్ పేజి కథలు

## పెళ్లిచూపులు



ఆ ఫీసు క్యాంటీన్ దగ్గర టీ తాగుతున్న రాంబాబు దగ్గరికి ప్యూన్ నారాయణ వచ్చి "ఏం సార్ పిలిచార్ట, ఏమైనా పనుందా?" అన్నాడు.

"అకౌంట్ సెక్షన్‌లో వున్న సురేష్‌కు మీ ఊళ్లో ఎవరిదో పెళ్లిసంబంధం గురించి ఏదో చెబుతున్నావే.." అన్నాడు రాంబాబు తాగేసిన టీ కప్పు పక్కన పెడుతూ.

"ఔన్సార్.. కానీ ఆ సారుకు మేనరికం వుందట, వద్దన్నాడు" చెప్పాడు నారాయణ.

"అమ్మాయి వాళ్లది మంచి ఫ్యామిలీయేనా?" సిగరెట్ వెలిగించుకుంటూ అడిగాడు రాంబాబు.

"చాలా మంచి ఫ్యామిలీ సార్. ఈమధ్య బిజినెస్‌లో నష్టాలొచ్చి చితికిపోయారుగానీ ఒకప్పుడు బాగా బతికినవాళ్లే" అన్నాడు నారాయణ.

"అమ్మాయి బావుంటుందా?"

"చాలా బావుంటుంది సార్.. పైగా మంచి అమ్మాయి."

"మరైతే నేను వచ్చి చూడనా?"

"తప్పకుండా సార్! కాకపోతే వాళ్లు పెద్దగా కట్నం ఇచ్చుకోలేరు" అన్నాడు నారాయణ.

"నాకు కట్నం అక్కర్లేదుగానీ అమ్మాయి బావుంటే చాలు. ఈ ఆదివారమే పెళ్లిచూపులకెళ్దాం. ఆ అమ్మాయి పెద్దలతో మాట్లాడి వాళ్ల ఊరు వెళ్లడానికి కారు అరేంజ్ చేసుకో" అంటూ అని సిగరెట్ పీకను విసిరేశాడు రాంబాబు.

"సరే" అని ఆనందంగా వెళ్లిపోయాడు నారాయణ.

నిజానికి రాంబాబుకీ మేనరికం వుంది. వచ్చే సంవత్సరమే తన మరదల్ని పెళ్లి చేసుకోబోతున్నాడు. రోజూ మెస్సు భోజనం తిని తినీ బోరు కొట్టింది. పెళ్లిచూపులకెళితే మంచి భోజనం తినొచ్చన్న దురాశ. పైగా కార్లో పల్లెటూరుకి వెళితే హాలిడే ఎంజాయ్ చేసినట్టు వుంటుందని ఈ పెళ్లిచూపులు ప్లాన్ చేశాడు, అంతే!

* * *

ఆదివారం పొద్దున్నే ట్రావెల్స్ నుంచి కారు తీసుకొచ్చాడు నారాయణ. అప్పటికే రాంబాబు కొత్త పెళ్లికొడుకులా తయారై వున్నాడు.

కొత్త షర్టు, కొత్త ప్యాంటు, రెండువేలు పెట్టి కొన్న లెదర్ చెప్పులు, బంగారంలా మెరిసిపోతున్న రిస్ట్‌వాచీతో రాంబాబు కళకళలాడిపోతున్నాడు.

మధ్యాహ్నం ఒంటిగంటకు పెళ్లికూతురి ఇంటికి చేరుకున్నారు రాంబాబు, నారాయణ.

"పెళ్లి చూపులకు వచ్చినవాళ్లకు ఇంటి భోజనం పెట్టం, ఇది మా సెంటిమెంట్. అందుకే ఇంట్లో వండకుండా పట్నంలో హోటల్ నుంచి పార్శిల్ తెప్పించాం" అని పెళ్లికూతురి అమ్మ సంజాయిషీ చెప్తూ అన్నం వడ్డించింది. రామేశ్వరం వెళ్లినా శనేశ్వరం వదలదన్నట్టు రాంబాబుకి ఇక్కడ కూడా హోటల్ ఫుడ్డే తినక తప్పలేదు.

తినడం అయ్యాక పెళ్లికూతుర్ని చూపించారు.

తను కేవలం సరదాకు వచ్చాడన్న సంగతి వాళ్లకు తెలీక, రాంబాబు ఇప్పుడే తమ అల్లుడైపోయినట్టు తెగ మర్యాదలు చేశారు అమ్మాయి తల్లిదండ్రులు.

సాయంత్రం బయల్దేరుతూ బయటకు వచ్చి చెప్పులు తొడుక్కోబోతూ అక్కడి దృశ్యాన్ని చూసి రాంబాబు గుండె బద్దలైంది. తను రెండువేలు పెట్టి కొన్న లెదర్ చెప్పులు తునాతునకలై వున్నాయి.

"సారీ బాబూ! ఈ పని మా కుక్కే చేసుంటుంది. దానికి లెదర్ చెప్పులు కనిపిస్తే చాలు, ముక్కలు ముక్కలు చేసేస్తుంది" అని పెళ్లికూతురి తండ్రి క్షమాపణ చెప్తున్న ధోరణిలో శెలవిచ్చాడు.

"నో ప్రాబ్లం" అని నవ్వుతూ తన బాధను మింగలేక కక్కలేక వట్టి కాళ్లతోనే కార్లో ఎక్కి కూర్చున్నాడు రాంబాబు. నారాయణ ఎక్కాక కారు బయల్దేరింది.

"అమ్మాయి మీకు నచ్చిందా సార్?" కారు ఊరు దాటిన తర్వాత అడిగాడు నారాయణ.

ఉత్తి పుణ్యానికి రెండువేల రూపాయల చెప్పులు పోయాయన్న బాధలో వున్న రాంబాబు ఏం సమాధానం చెప్పకుండా మౌనంగా వుండిపోయాడు.

"ఏం సార్ మీకు అమ్మాయి నచ్చలేదా?" అని మళ్లీ అడిగాడు నారాయణ.

"లేదు" అనేశాడు రాంబాబు ఏదో ఆలోచిస్తూ.

ఇంతలో ధాబా వచ్చింది.

"సార్ ఇక్కడ మిరపకాయ బజ్జీలు చాలా బావుంటాయి, తిందామా?" అడిగాడు నారాయణ.

"సరే" అన్నాడు రాంబాబు.

నారాయణ, కారు డ్రైవర్ చెరొక ప్లేటు మిరపకాయ బజ్జీలు తింటే, రాంబాబు సిగ్గులేకుండా మూడు ప్లేట్లు తిని తను ఎక్కడ బిల్లు ఇవ్వాల్సివస్తుందోనని తప్పించుకోడానికి ధాబా బయట టేబుల్ మీదున్న న్యూస్‌పేపర్ చదువుతున్నట్టు నటించసాగాడు. ఇంతలో నారాయణ బిల్లు ఇచ్చేశాడు. ఇదంతా ఓరకంట గమనించిన రాంబాబు ఏమీ తెలీనట్టు పర్సుతీసి బిల్లు ఇవ్వబోయాడు.

"సార్ ఇచ్చేశాను" అన్నాడు నారాయణ.

'నువ్వెందుకు ఇచ్చావ్, నేను ఇచ్చేవాడ్నిగా' అన్నట్టు ఎక్స్‌ప్రెషన్ ఇచ్చి పర్సు జేబులో పెట్టుకున్నాడు. కారు ఎక్కబోతూ సిగరెట్ కోసమని అక్కడే వున్న బడ్డీకొట్టు దగ్గరకు వెళ్లాడు రాంబాబు. ఇంతలో ఒకడు రాంబాబు పక్కన పాన్ ఉమ్మాడు.

అప్పుడే గాలి వీచడంతో ఆ ఉమ్ము కాస్తా వెళ్లి రాంబాబు కాలి మీద పడింది.

ఖరీదైన తన చెప్పులు కుక్క తినేసిందన్న బాధలో వున్న రాంబాబు ఆ పాన్ ఉమ్మినవాడి చెంప మీద కొట్టాడు.

"ఎవడ్రా నువ్వు.. నా ఏరియాకొచ్చి నన్నే కొడతావా?" అని రాంబాబు డొక్కలో తన్నాడు వాడు.

దాంతో రాంబాబు విసురుగా వెళ్లి ఓ ఐరన్ గేటుకు గుద్దుకున్నాడు. చేతికున్న వాచీ పగిలి, దానిలో వున్న పార్ట్స్ అన్నీ రాలి కింద పడిపోయాయి.

అతడి కోపం నషాళానికి ఎక్కింది. కింద పడిన రాంబాబు లేచి అక్కడున్న కర్ర తీసుకుని వాడి తల మీద కొట్టాడు.

వాడు బాగా తాగి వున్నాడేమో ఆ దెబ్బను లెక్కచేయకుండా రాంబాబు మీద పడి షర్టు బరబరా చించేసి కింద పడేసి మూతిమీద కొట్టసాగేడు. ఇంతలో అందరూ కల్పించుకుని గొడవకు ఫుల్‌స్టాప్ పెట్టారు.

చెప్పుల్లేని కాళ్లు, చిరిగిన షర్టు, పగిలిన వాచీ, కనిపించని దెబ్బలతో మౌనంగా కారు ఎక్కి కూర్చున్నాడు

రాంబాబు.

కారు బయల్దేరింది. రాంబాబు పరిస్థితి చూసి నారాయణకు నవ్వు వస్తున్నా బలవంతంగా ఆపుకున్నాడు.

కారు తన రూం చేరేసరికి బాగా చీకటి పడింది. బతుకు జీవుడా అనుకుంటూ ఎవరూ చూడకుండా కారు దిగి తన రూంలోకి వెళ్లి బెడ్‌మీద పడుకుని తనివితీరా ఏడ్చాడు. పాన్ ఉమ్మినవాడు కొట్టిన దెబ్బలకు జ్వరం వచ్చింది రాంబాబుకు. దాంతో వారం రోజులు ఆఫీసుకు లీవ్ పెట్టి రూంలోనే వుండిపోయాడు.

వారం తర్వాత ఆఫీసుకొచ్చాడు రాంబాబు. క్యాంటీన్ దగ్గర టీ తాగుతున్న అతడి దగ్గరకు ప్యూన్ నారాయణ వచ్చి "సార్ మొన్న మనం పెళ్లి చూపులకెళ్లిన అమ్మాయికి సంబంధం కుదిరిపోయింది. ఇదివరకు ఓ అబ్బాయి ఈ అమ్మాయిని చూడటానికొచ్చి, అమ్మాయి నచ్చిందిగానీ కట్నం ఎక్కువ కావాలని అడిగాడట. దాంతో వీళ్లు ఆ సంబంధం వద్దనుకున్నారు. కానీ మొన్న మనం పెళ్లి చూపులకు వచ్చి వెళ్లినట్టు ఆ అబ్బాయికి తెలిసి, మన సంబంధం ఎక్కడ కుదిరిపోతుందోనని ఆ అబ్బాయి కట్నం కూడా వద్దని చెప్పి పెళ్లి చేసుకోడానికి ముందుకొచ్చాడు. మనం పెళ్లి చూపులకు వెళ్లడం వల్ల ఆ అమ్మాయికి మంచే జరిగింది" సంతోషంగా చెప్పాడు నారాయణ.

అతనికి ఏం జవాబు చెప్పాలో తెలీక, దేభ్యం మొఖం వేసుకుని చూస్తూ వుండిపోయాడు రాంబాబు.

**-ఎం.గాంధీ** (హైదరాబాద్)

★ ★ ★


# వసంతం మళ్లీ వస్తుంది

మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలేనని అన్నది నా వాదన. దీంతో ఏకీభవించడు మూర్తి. ఇందులో కొంత వాస్తవం వున్నా అందరూ డబ్బు కోసమే జీవించరు, ఇదీ వాడి ఖచ్చితమైన అభిప్రాయం. ఇచ్చేవాడు వుండటం వల్లే పుచ్చుకొనేవాడికి అవసరం పుట్టుకొస్తుంది. ఎవరైనాసరే వాళ్ల సంపాదన ఏంటో తెలుసుకుని ప్రణాళికాబద్ధంగా జీవిస్తే ఎదుటివాళ్లను చేయి చాచి అడిగే ప్రసక్తి రాదు అని నేనంటే, అస్సలు ఒప్పుకోడు. దానికి వివరణ ఇస్తాడు. ఒక్క ఆర్థిక సంబంధాల గురించే కాదు, మానవత్వపు విలువల గురించి, దేశ రాజకీయాల నుంచి సమాజంలో వున్న అసమానతల వరకు ఏ విషయంలో అయినాసరే అతని దగ్గర సమాధానం సిద్ధంగా వుంటుంది.

మూర్తి, నేను చిన్ననాటి స్నేహితులం. చదువు రాక నేను, చదువుకునే స్తోమత లేక వాడు ఇదే ఊళ్లో వుంటున్నాం. పక్క ఊరి రైసుమిల్లులో గుమస్తాగా మూర్తి జీవితం, మోతుబరి రైతుగా నా జీవితం సాఫీగానే సాగిపోతున్నాయి. అంత తక్కువ జీతంతో జీవితాన్ని నెట్టుకొస్తున్నాడన్నమాటేగానీ మూర్తి నన్ను ఏనాడూ నోరు తెరచి సహాయం అడగలేదు, నేను చేయనూలేదు. దానికి కారణం మా స్నేహసంబంధాన్ని ఆర్థిక బంధంగా మార్చి చెడగొట్టుకోవడం నాకిష్టం లేదు.

ఇద్దరం మంచి స్నేహితులమే కాదు, భక్తులం కూడ. నెలకి ఒక్కసారైనా బాబా గుడికి కలిసి వెళతాం. అలా వెళ్లేప్పుడు ఎన్నో విషయాలు చర్చించుకుంటూనే వుంటాం. వాదించుకుంటూనే వుంటాం.

ఆరోజు అలాగే మాట్లాడుకుంటూ గుడిని సమీపించాం. గుడి ముందు కూర్చున్న బిచ్చగాళ్లలో ఒకడ్ని చూశాను. బాగా పరిచయమున్న ముఖం. ఖచ్చితంగా సుబ్బన్న తాతే! మమ్మల్ని చూడనట్టు తల దించుకొన్నాడు. మూర్తి చూల్లేదనుకుంటా! చూసుంటే తప్పకుండా పలకరించేవాడు. మూర్తికి సుబ్బన్నతాత బాగా పరిచయస్తుడు. బాబా దర్శనం అయ్యాక తిరిగి వస్తుంటే మూర్తి సుబ్బన్న



తాత దగ్గరగా వంగి "తాతా!" అని పిలిచాడు. తలెత్తిన సుబ్బన్న తాత కళ్లలో బాధ, సిగ్గు కలగలసి కన్నీళ్ల రూపంలో బయటికి వచ్చాయి.

మూర్తి దగ్గర్లో వున్న హోటల్‌కి తీసుకెళ్లి సుబ్బన్న తాతకి కడుపునిండా టిఫిన్ పెట్టించి, వేడి వేడి టీ తాగిన తర్వాత, తనదగ్గరున్న రెండువేల నాలుగు వందల రూపాయల్ని సుబ్బన్న తాత చేతిలో పెట్టాడు. "ఇంకేదైనా అవసరం వస్తే ఇంటికి రా తాతా! నేను మళ్లీ కలుస్తాను, వస్తాను" అని చెప్పి వచ్చేశాడు. వాడి వెనకాలే నేను. ప్రేక్షకుడిలా చూడటం తప్ప అక్కడ ఏం మాట్లాడాలో తెలీలేదు. కానీ ఇప్పుడు ప్రశ్నించకుండా వుండలేకపోయాను. "అంత డబ్బు నీకు ఎక్కడిదిరా?" ఇదే నా ప్రశ్న.

నోరు విప్పాడు మూర్తి. "వసంత్! నెలకి యాభై రూపాయలు నా జీతం లోంచి తీసి, దేవుడి పేర దాస్తున్నాను. నాలుగేళ్లనుంచి దాచిన ఆ డబ్బు సాయిబాబా పేరున అన్నదానం చేద్దామని తెచ్చాను. సుబ్బన్న తాత గురించి నీకు తెలియంది కాదు. ఉన్న ఆస్తిని ఇద్దరు కొడుకులకీ పంచి, ఎంతో ముందుచూపుతో పొలాన్ని తన పేరుమీదే వుంచుకున్నాడు.

కొడుకు వ్యాపారంలో నష్టం వచ్చి ఆస్తి పోగొట్టుకుని అప్పులపాలై, ఎవరికీ చెప్పకుండా కుటుంబంతో సహా ఎక్కడికో వెళ్లిపోయాడు. ఎక్కడ వున్నాడో తండ్రికైనా తెలియనివ్వలేదు. ఆ బాధ్యత సుబ్బన్న తాత తనమీద వేసుకున్నాడు. ఉన్న పొలాన్ని అమ్మి కొడుకు చేసిన అప్పులు తీర్చి, మరో కొడుకు ఇంటికి వెళ్లిపోయాడు. ఏమైందో ఏమో ఇన్నాళ్లకి ఇలా కనిపించాడు.

వసంత్! నువ్వు అంటూ వుంటావే, ప్రణాళికాబద్ధమైన జీవితం అని! దానికంటే, మన ఆలోచనల కంటే అతీతమైన అద్భుత శక్తి ఒకటుంది. అదే కాలం! దాన్ని ఎదిరించలేం, ఎదురీదలేం! కాలం గాయం చేసినప్పుడు, ఒకరికొకరం ఆత్మీయతని పంచుకోవడం తప్ప మనమేమీ చెయ్యలేం. సహాయం అనేది మన స్తోమతు మించి చేయనవసరం లేదు. మనకి తోచినంతలోనే అది అవతలివారికి సంబంధించి ఒక్క పూటకైనా, కొన్ని రోజులకైనా విలువైనదే. ఇక దేవుడి మొక్కు అంటావా? అదీ తీరినట్టే!

బిక్షమెత్తి జీవిస్తూ, వచ్చిన ఆహారాన్నీ ధనాన్నీ లేనివారికి పంచిపెట్టే ఆ సాయి తత్వం నిరుపేదలకు సహాయం చేయమనే. నేను ఆ డబ్బు హుండీలో వేసినా, ఏ అన్నదానానికో సమర్పించినా, అంతా ఆ సాయి సమర్పణే. నేను సుబ్బన్నతాతకు ఇవ్వడం కూడా సాయి సమర్పణే! గొప్ప బ్రతుకు బతికిన సుబ్బన్నతాత ఏమీచేయలేని పరిస్థితుల్లో మాత్రమే చేయి చాచి అర్థిస్తున్నాడు. అన్నీ తెలిసీ అవకాశం వుండి, ఇవ్వకుండా వుండలేకపోయాను. అది చెడ్డపని కాదుకదా వసంత్..." మూర్తి మాటలు సాగుతూనే వున్నాయి.

మూర్తి చెప్పేది నిజమే. ఇవ్వగలిగే అవకాశం నాకూ వుంది. కానీ ఆలోచనే రాలేదు. ఎవరిదాకానో ఎందుకు? ఇన్నేళ్ల మా స్నేహంలో మూర్తికి సంబంధించి అతనికి నా అవసరం ఒక్కసారైనా రాలేదా? లేక నా తత్వం తెలిసి అడగలేకపోయాడా?

ఆ ఆలోచన రాగానే మనసంతా బాధగా అయిపోయింది. అమ్మా నాన్నా వసంతరావు అని పేరు పెట్టినందుకైనా ఏ ఒక్కరి జీవితంలోనూ చిన్న ఆశనైనా పూయించలేకపోయాను. మూర్తి స్నేహితుణ్ణి అయినందుకైనా, ఇకముందు 'వసంతాన్ని పంచే వసంతరావుని' కావాలని మనస్ఫూర్తిగా నిశ్చయించుకున్నాను.

**-పద్మసాయి** (ఊతకోట)